క్లుప్తంగా

ఘనంగా చర్చి వార్షికోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న చర్చి అధ్యక్షుడు ఏడీఏ లింకన్, తదితరులు

కర్నూలు(అర్బన్): నగరంలో కోల్స్ సెంటీనియల్ బాప్టిస్టు చర్చి 106వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చి అధ్యక్షుడు ఏడీఏ లింకన్, పాస్టర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు క్రీడా పోటీలను ప్రారంభించారు. వార్షికోత్సవ కమిటీ చైర్మన్ పి.దినకర్, కార్య దర్శి కే.ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో పోటీలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. వాలీబాల్, ఫుట్‌బాల్, క్యారమ్స్, క్రికెట్, బ్యా డ్మింటన్ క్రీడలను చర్చి ఆవరణలో నిర్వహించారు. సభ్యులు రవికుమార్, సంపత్ పాల్గొన్నారు.

మాజీ సైనికుడి మృతి



బి.మద్దిలేటి నాయుడు (ఫైల్)

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పత్తికొండలో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు బీ.మద్దిలేటినాయుడు మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్యంలో నాయక్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఆయన మృతి పట్ల సంఘం తరపున సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబానికి సంఘం అండగా నిలుస్తుందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు (అర్బన్): స్థానిక సీ.క్యాంపు లలిత కళా సమితి భవనంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కర్నూలు బి.క్యాంపులోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల హాస్టల్ పూర్వ విద్యార్థులు వారి గురువు వీర ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి డీఎస్పీ మహబూబ్ బాషా, పూర్వ విద్యార్థి సీఐ క్రాంతికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లెపోగు రాజన్న, కె.శ్రీనివాసులు, రామయ్య, డీవీఎంసీ సభ్యులు కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

కర్నూలు కల్చరల్: హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్వచ్ఛ హంద్రీ - స్వచ్ఛ కేసీ కెనాల్ పేరుతో ర్యాలీ, నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ అక్కడే నిరసన ఉంటుందని పేర్కొన్నారు. హంద్రీ, కేసీ కెనాల్‌లో పూడిక తీసి గుర్రపుడెక్కను తొలగించాలని, మురుగు నీరు కలవకుండా అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ ఏర్పాటు చేయాలని, కేసీ కెనాల్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో చేసున్న ర్యాలీలో అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

కర్నూలు(న్యూసిటీ): నగరంలో భారీ వర్షాలు, ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దేవనగర్ పాతకల్లూరు వెళ్లే బ్రిడ్జి సమీపంలో విద్యుత్ తీగ తెగిపడటంతో అక్కడున్న వారు భయంతో దూరంగా పరుగులు తీశారు. దీంతో కొంత సేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. కొందరు వాహనదారులు వెనుతిరిగి వేరే మార్గం వైపు వెళ్లారు. విద్యుత్ సిబ్బంది అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

జీఓ 115 రద్దు చేయాలి

కర్నూలు(హాస్పిటల్): కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల భవిష్యత్‌ను నాశనం చేసే విధంగా ఉన్న జీఓ నంబర్ 115ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని టీఎన్‌టీయూసీ స్టేట్ జనరల్ సెక్రటరీ అశోక్‌కుమార్ కోరారు. ఆదివారం కర్నూలులో తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులందరినీ రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. జీఓ నంబర్ 115 వల్ల వారికి అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏపీ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు శాంతి భవాని, ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎ.మాధవరాజు, జనరల్ సెక్రటరీ సి.బంగారి తదితరులు పాల్గొన్నారు.

రాజనీతిజ్ఞుడు ఆంధ్రకేసరి



ఆంధ్రకేసరి, మేడూరి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యశీలి, రాజనీతిజ్ఞుడని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ, సాహితీ సదస్సు సంయుక్తంగా ఆదివారం కేవీఆర్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు, మేడూరి దీక్షితులు వెంకటసుబ్బయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. వీసీ, సాహితీ సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర తదితరులు మాట్లాడారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్యకుమార్, మాదిరాజు శ్రీనివాస్, జీఎస్ఆర్కే శర్మ, కావెం సుబ్బలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.







వినాయక పూజలో కలెక్టర్ రంజిత్‌బాషా, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు, అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు



బుధవారపేటలోని భారీ వినాయకుడు


విఘ్నాధిపా.. వినాయకా

వినాయక చవితి ఉత్సవాలను నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభించారు. సందుసందునా, వాడవాడలా భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయగా అపార్టుమెంట్లు, కార్యాలయాలతో పాటు గృహాల్లో విఘ్ననాయకుడి ప్రతిమలను ఏర్పాటు చేసి ఘనంగా పూజలు చేశారు. వివిధ రూపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజలు గణపతికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. వినాయక వ్రతకల్పాన్ని పండితులు వివరించారు. ఓల్డ్‌సిటీలోని పెద్ద మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన 63 అడుగుల మట్టి వినాయక విగ్రహం, ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయం, పప్పుల బజార్, మించిన్ బజార్, రంగరాజు వీధి, అశోక్ నగర్, బుధవారపేట మెయిన్ రోడ్, మద్దూరు నగర్, కురువ వీధి, సర్దార్ నాగప్ప వీధి, లాల్ బహదూర్ శాస్త్రి నగర్, బిక్యాంప్ పార్క్, ఇందిరా గాంధి నగర్, వీఆర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా ఉండటంతో ఆయా మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్/కర్నూలు కల్చరల్



బాపూజీ నగర్‌లో..



పింజరి గేరిలో శివలింగం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న వినాయకుడు



కుమ్మరిగేరిలో తబలా వాయిస్తున్న వినాయకుడు



కుమ్మరి గేరిలోని వినాయకుడి వ్రతకల్పం వివరిస్తున్న పురోహితుడు



శ్రీనివాస క్లాత్ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన 5 కేజీల వెండి వినాయకుడు



షరాఫ్ బజార్‌లో..



కుమ్మరి గేరిలో ఊర్ధ్వ గణపతి



రాంబొట్ల ఆలయం వద్ద వినాయకుడికి పూజలు



ఎలుకలతో ఆటలాడుతున్న వినాయకుడు



బుధవారపేట రాజీవ్ గృహకల్ప కాలనీలో..



ప్రకాష్‌నగర్‌లో వినాయకుడి తలపై క్షీరసాగరమథనం



బుధవారపేటలోని దుర్గమ్మ గుడి వద్ద..



విద్యానగర్‌లో..




బుధవారపేటలో వేంకటేశ్వరస్వామి రూపంలో..




శ్రీనివాసనగర్‌లో..



రాఘూర్ నగర్‌లో..



ఆనంద్ థియేటర్ లైన్‌లో..



సత్యసాయి మందిరంలో..



వినాయక పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అర్బన్ 20వ వార్డు టెలికాంనగర్, 35వ వార్డు సుంకులమ్మ గుడి, కల్లూరు ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. 34వ వార్డులో వినాయక పూజ, భక్తులకు అన్నదానం చేశారు. కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

కర్నూలు(అర్బన్): స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో 9 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మేయర్ బీవై రామయ్య, కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ శనివారం ఉదయం స్వామివారికి ప్రథమ పూజలు నిర్వహించారు. మేనేజర్ చిన్న రాముడు, కార్యదర్శి నాగరాజు, పర్యవేక్షకులు ప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న కమిషనర్ రామలింగేశ్వర్

విందు పసందు

కర్నూలు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల -1 వసతి గృహంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వసతి గృహ సంక్షేమాధికారిణి బెన్నమ్మ ఆధ్వర్యంలో హాస్టల్ పరిసరాలను శుభ్రం చేసి కల్లాపి చల్లి ముగ్గులు వేసి రంగులతో అలంకరించారు. వినాయకుడికి నైవేద్యం పెట్టారు. విద్యార్థినులకు షడ్రుచులతో విందు ఏర్పాటు చేశారు. కలర్ రైస్, అన్నం, పప్పు, సాంబారు, పెరుగు పచ్చడి, పల్లీల చట్నీ, వడియాలు, లడ్డూ, వినాయకుడికి ఇష్టమైన కుడుములు, అరటి పండ్లు వడ్డించారు.



సంక్షేమ హాస్టల్‌లో పంచభక్ష పరమాన్న విందు


29న బ్రాహ్మణ సంఘం ఎన్నికలు

కర్నూలు(అర్బన్): నగర బ్రాహ్మణ సంఘం (రిజిస్టర్ నంబర్: 411/2015) ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎన్నికల అధికారిగా నియమితులైన కల్లే వేణుగోపాల్ శర్మ తెలిపారు. ఆదివారం స్థానిక సంకల్‌భాగ్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రాహ్మణ నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 20వ తేదీలోగా సభ్యత్వాలు పూర్తి కావాలన్నారు. అనంతరం గుర్తింపు కార్డులు అందించి ఓటు హక్కు కల్పిస్తారన్నారు. 22, 23 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 24న పరిశీలన, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుందని చెప్పారు. 25న బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రకటన, 29న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్లను లెక్కించి విజేతలకు ధ్రువపత్రాలు అందిస్తామన్నారు. నాయకులు చల్లా నాగరాజశర్మ, కంచుగంటల శ్యాంసుందర్‌శర్మ, సండేల్ చంద్రశేఖర్, నాగులవరం రాజశేఖర్, ఆకెళ్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ ఫారాలను విడుదల చేస్తున్న బ్రాహ్మణ నేతలు

సాంస్కృతికాంశాల పోటీలకు విశేష స్పందన



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు



పోటీలకు హాజరైన విద్యార్థులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే ఆధ్యాత్మికత, నైతిక విలువలు, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు అన్నారు. ఆదివారం కేంద్ర సమితి ఆధ్వర్యంలో నగర శివారులోని క్రైడో స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన తదితర సాంస్కృతికాంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీలకు విశేష స్పందన లభించిందని, 571 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, కె.చెన్నయ్య, శ్రావ్య కార్తీక్, సూరా వెంకటరెడ్డి, మేడా సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. మామిళ్లపల్లి రాజేష్ శర్మ, చింతలపల్లి రామకృష్ణ, రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ నూతన అధ్యక్షుడిగా మురళీకృష్ణ



కర్నూలు కల్చరల్: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ నియమితులయ్యారు. అలాగే కర్నూలు నగర కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా షేక్ జిలాని బాషాను నియమించారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు(అర్బన్): ఆత్మరక్షణ క్రీడ తైక్వాండోలో నిత్యం సాధన చేయాలని 4వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఊట్ల రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కులో తైక్వాండో బెల్ట్ గ్రేడ్ల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పతకాలు, బెల్టులు అందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కర్నూలు కల్చరల్: మహమ్మద్ ప్రవక్త జయంతి పురస్కరించుకొని ఆదివారం స్థానిక లతీఫ్ లావుబాలి దర్గా మైదానంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. సెంట్రల్ మిలాద్ కమిటీ కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన క్యాంప్‌లో బీపీ, షుగర్, ఈసీజీ, డెంటల్ లాంటి వివిధ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షఫి పాషా ఖాద్రి, సభ్యులు సయ్యద్ తాహపాషాఖాద్రి, సయ్యద్ రషీద్ పాషా ఖాద్రి, కార్పొరేటర్ షేక్ యూనస్ బాష, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్థిక సహకారం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని 72 మంది ఆర్యవైశ్య విద్యార్థినీ, విద్యార్థులకు ఆదివారం కర్నూలులోని ఆవోపా భవన్‌లో రూ.10.94 లక్షల ఆర్థిక సహకారం అందించారు. అలాగే పాలిమేర వేణుగోపాల్ కామాక్షమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అత్యంత ప్రతిభ కనబరిచిన నగరంలోని 14 మంది విద్యార్థులకు పురస్కారాలు, గోల్డ్‌మెడల్స్ అందించారు. ముఖ్య అతిథులుగా ఆళ్లగడ్డకు చెందిన ఆవోపా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.కసెట్టి ప్రభాకర్, సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అధ్యక్షులు మేడా వెంకటసురేష్, కార్యదర్శి జీవీ మురళీక్రిష్ణ, కోశాధికారి మేడా పురుషోత్తం, కన్వీనర్ ఎం నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, వెంకటప్రసాద్, నరసింహులు, హరినారాయణ, అజయ్‌కుమార్, రమణయ్య, కొండయ్య, డీ సుబ్బయ్య, జవహర్ బాబు, గురుప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు అనిత, శోభ ఆదిలక్ష్మి, రాధిక, శైలజ, లావణ్య, గిరిజ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందుకున్న ఆర్యవైశ్య విద్యార్థులు

జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ల కార్యవర్గం ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్స్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం స్థానిక సి.క్యాంపులోని డ్రైవర్స్ అసోసియేషన్ కార్యాలయంలో హెల్త్ ఎడ్యుకేటర్ల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. నూతన అధ్యక్షులుగా డబ్ల్యు. వెంకటరమణ, జిల్లా కార్యదర్శిగా పి. సుభాషిణి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి. కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా కె. సరోజ, జాయింట్ సెక్రటరీగా కె. స్వర్ణగౌరి, ఆర్గనైజింగ్ సెక్రటరిగా షణ్ముకుడు, ట్రెజరర్‌గా ఎల్. రాఘవేంద్రగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్లకు గజిటెడ్ హోదా కల్పించాలని, పాత జిల్లాలతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన అన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాల్లో రెండు డిప్యూటీ డెమో పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న డెమో పోస్టులు వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, డిప్లమా ఇన్ హెల్త్ ఎడ్యుకేషన్, ప్రమోషన్ కలిగిన హెల్త్ ఎడ్యుకేటర్స్‌ను ఎయిడ్స్, లెప్రసి విభాగంలో విలీనం చేసి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్చు చేయాలని కోరారు.



హెల్త్ ఎడ్యుకేటర్ల కార్యవర్గ సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు